నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 సోమవారం 6 జనవరి 2025
MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## నీలాబాయికి ఎమ్మెల్యే కోవలక్ష్మి పరామర్శ

జైనూర్, జనవరి 5: జైనూర్ మండలంలోని దేవుగూడలో హత్యాయత్నం బాధితురాలు నీలాబాయిని ఆదివారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధితురాలిని సోమవారం పరామర్శించేందుకు జిల్లాకు ఎమ్మెల్సీ కవిత వస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ కవిత పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పాక్స్ డైరెక్టర్ హన్నుపటేల్, మడావి భీంరావు, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి


ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

# ఓదార్పునిచ్చేందుకు..

## నేడు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎమ్మెల్సీ కవిత పర్యటన

- జైనూర్‌లో నీలాబాయి, దాబాలో శైలజ కుటుంబాలకు పరామర్శ
- స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసిన బీఆర్ఎస్ శ్రేణులు
- మొదటగా ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద నివాళి
- 120 కిలోమీటర్ల మేర భారీ బైక్ ర్యాలీ
- సింగరేణి కార్మికులతో సమావేశం

కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 5(నమస్తే తెలంగాణ) : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సోమవారం ఎమ్మెల్సీ కవిత పర్యటించనున్నారు. ఇందుకోసం బీఆర్ఎస్ శ్రేణులు భారీ ఏర్పా ట్లు చేశాయి. రహదారులన్నీ పోస్టర్లు, ఫ్లెక్సీలతో నిండి గులాబీ మయంగా మారాయి. మొదటగా ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తారు. అనంతరం జైనూర్ మండలంలోని నార్నూర్ ఎక్స్ రోడ్డు నుంచి రెబ్బెన మండలంలోని గోలేటి వరకు దాదాపు 120 కిలోమీటర్ల మేర బైక్‌ర్యాలీ కొనసాగనుంది. జైనూర్ మండలంలోని దేవునిగూడలో ఆటోడ్రైవర్ చేతిలో హత్యాయత్నానికి గురైన మెస్రం నీలాబాయిని పరామర్శిస్తారు. అనంతరం జైనూర్ మండల కేంద్రంలోని ఆసుపత్రి, బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శిస్తారు. వాంకిడి మండలంలోని దాబా గ్రామానికి చెందిన విద్యార్థి శైలజ విష ఆహారం బారిన పడి మరణించిన విషయం తెలిసిందే. వీరి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. రాష్ట్రంలోనే సంచలనం కలిగించిన రెండు ఘటనల్లో బాధిత కుటుంబాలకు ఆరు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి పైసా రాలేదు. అనంతరం గోలేటిలో సింగరేణి కార్మికులతో సమావేశం నిర్వహించి, కార్మికుల నుంచి సమస్యలను తెలుసుకుంటారు.


వాంకిడి ఆశ్రమ పాఠశాలలో విష ఆహారంతో మరణించిన విద్యార్థిని కుటుంబ సభ్యులు

### చావు అంచుల దాకా వెళ్లిన నీలాబాయి

ఆటోడ్రైవర్ చేతిలో హత్యాయత్నానికి గురైన నీలాబాయి చావు అంచుల దాకా వెళ్లింది. ఈ ఘటనతో ఆవేశానికి గురైన ఆదివాసులు జైనూర్ మండలంలోని ఓ వర్గానికి చెందిన వ్యాపార సముదాయాలకు నిప్పుపెట్టి ధ్వంసం చేశారు. దాదాపు మూడు నెలలపాటు పోలీసులు కట్టుదిట్టమైన ఆంక్షలు విధించారు. ఇరువర్గాల వారిని కట్టడిచేసి శాంతిని నెలకొల్పేందుకు కఠిన చర్యలను అమలు చేశారు. ఈ ఘటన జరిగి దాదాపు ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ జైనూర్‌పై పోలీసుల నిఘా కొనసాగుతూనే ఉంది.

### ఆర్థిక సహాయం అందలేదు : నీలాబాయి

నాపై దాడి జరిగి దాదాపు ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందలేదు. నా కొడుకు ప్రవీణ్‌కుమార్‌కు నామమాత్రంగా కెరమెరిలోని హట్టిలో గల ఆశ్రమ పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ పని కల్పించారు. రోజు వారి కూలీగా పనిచేసుకుంటూ జీవించే నాపై హత్యాయత్నం జరిగిన తరువాత కోలుకునేందుకు మూడు నెలలు పట్టింది. నాపై హత్యాయత్నం చేసినప్పుడు తగిలిన గాయాలు ఇప్పటికీ బాధిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి. పక్కా ఇల్లు ఇవ్వాలని కోరుతున్నా.

### 25 రోజులు వెంటిలేటర్‌పై ఉండి..

వాంకిడి బాలికల ఆశ్రమ పాఠశాలలో విష ఆహారం తిని దాదాపు 60 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఇందులో తొమ్మిదో తరగతి విద్యార్థిని శైలజ ప్రాణాపాయ స్థితిలో దాదాపు 25 రోజులపాటు హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ మృతి చెందింది. కట్టుదిట్టమైన భద్రత మధ్య శైలజ అంత్యక్రియలు నిర్వహించారు. శైలజ మరణంతో విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాయి. దీంతో ప్రభుత్వం వారి కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చింది. కానీ, ఇప్పటివరకు సహాయం అందలేదని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు.

### ఆదుకోవాలి..



మా బిడ్డ చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న మాకు ప్రభుత్వం నుంచి సహాయం అందలేదు. మా బిడ్డ అంత్యక్రియలను కూడా పోలీసులు బలవంతంగా నిర్వహించారు. ఆ సమయంలో మాకు రూ.50 లక్షలు, మా కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, పక్కా ఇల్లు, ఐదెకరాల భూమి కావాలని అడిగాం. వీటిలో ఏ ఒక్కటి కూడా ప్రభుత్వం నెరవేర్చలేదు. ఐటీడీఏ డీడీ రూ.2 లక్షలు, ఎమ్మెల్సీ దండె విఠల్ రూ.లక్ష ఇచ్చారు. అంత్యక్రియల కోసం రూ. లక్ష ఇచ్చారు. బొంబారలోని ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని తండ్రి తుకారాంకు ఔట్‌సోర్సింగ్‌లో పని కల్పించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి.

**- శైలజ తల్లి మీరాబాయి**

# అసెంబ్లీలో మాట్లాడినా బస్సు రాలే..

- ఆర్టీసీ సేవల పునరుద్ధరణపై అసెంబ్లీ వేదికగా ప్రశ్నించిన ఎమ్మెల్యే వివేక్
- నేటికీ ప్రారంభంకాని ఆర్టీసీ సేవలు

మంచిర్యాల, జనవరి 5(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సాక్షాత్తు 'అధికార పార్టీ ఎమ్మెల్యే గడ్డం వివేక్ అసెంబ్లీలో ఆర్టీసీ సేవల పునరుద్ధరణపై మాట్లాడినా నేటికీ బస్సు సేవలు ప్రారంభం కాలేదు. గతేడాది డిసెంబర్ 17వ తేదీన జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కోటపల్లి మండలంలోని జనగామ రూట్, అదే విధంగా నక్కలపల్లి రూట్‌లో బస్సులు నడిపించాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే వివేక్ కోరారు. వీటితో పాటు చెన్నూర్ నుంచి హైదరాబాద్‌కు ఉదయం బస్సు నడించాలని కోరారు. ఎమ్మెల్యే సాక్షాత్తు అసెంబ్లీలో మాట్లాడడంతో ఆర్టీసీ సేవలు పునరుద్ధరణ అవుతాయని ప్రజలు ఆనందపడ్డారు. కానీ.. అసెంబ్లీలో మాట్లాడి 20 రోజులు గడుస్తున్నా.. ఆర్టీసీ సేవల పునరుద్ధరణ జరగకపోవడంపై ప్రజలు తీవ్ర నిరాశలో ఉన్నారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని జనగామ రూట్‌లో పారుపల్లి గ్రామం సమీపంలో విద్యుత్ తీగలు బస్సుకు తాకేలా ఉన్నాయని బస్సు సేవలను నిలిపి వేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ మార్గంలో బస్సు సేవలు నిలిచిపోగా పారుపల్లి గ్రామం నుంచి జనగామ గ్రామం వరకు ఉన్న పది గ్రామాల ప్రజలు రోజు వందల రూపాయలు ప్రైవేట్ వాహనాల యజమానులకు చెల్లిస్తూ రాకపోకలు సాగిస్తున్నారు. కోటపల్లి మండలంలోని నక్కలపల్లి రూట్‌లోనూ ఆర్టీసీ సేవలు పూర్తిగా నిలిచిపోగా.. నక్కలపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల ప్రజలతోపాటు పక్కనే ఉన్న వేమనపల్లి మండలాల ప్రజలకు ప్రైవేట్ వాహనాలే దిక్కుగా మారుతున్నాయి. ఎమ్మెల్యే అసెంబ్లీ సాక్షిగా మాట్లాడిన అతి చిన్న సమస్య కూడా అలానే ఉండడంపై ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.


కోటపల్లి మండలం పారుపల్లి-లింగన్నపేట రూట్‌లో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు


ఎమ్మెల్యే వివేక్‌కు వినతి పత్రం ఇస్తున్న మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ

### ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా..

కోటపల్లి మండలంలోని చెన్నూర్ నుంచి జనగామ రూట్‌లో ఆర్టీసీ సేవల పునరుద్ధరణపై ఆ ప్రాంత మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఇప్పటికే ఎమ్మెల్యే వివేక్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ తీగలు సరిచేస్తే మా రూట్‌లో బస్సు సేవల పునరుద్ధరణ జరుగుతుందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. వీటితోపాటు బీజేపీ మండల నాయకులు మంత్రి రామయ్య కూడా ప్రజావాణిలో ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరించాల్సిన ఎమ్మెల్యే వివేక్ కూడా ఒక అడుగు ముందుకేసి తన నియోజకవర్గంలోని కోటపల్లి మండలంలోని జనగామ, నక్కలపల్లి రూట్‌లో బస్సు సేవలను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. బస్సు సేవల పునరుద్ధరణపై ఎమ్మెల్యే అసెంబ్లీ వేదికగా మాట్లాడినా.. నేటికీ ఫలితం లేకపోవడంపై 'ఇదేం పాలన బాబోయ్' అంటూ ప్రజలు తలలు పట్టుకుంటున్నారు.

### బస్సు సేవలను పునరుద్ధరించాలి


జనగామ రూట్‌లో బస్సు నడపాలని కలెక్టర్‌ను కోరుతున్న మంత్రి రామయ్య

కోటపల్లి మండలంలోని జనగామ రూట్‌లో ఆర్టీసీ సేవల పునరుద్ధరణపై కలెక్టర్, ఆర్టీసీ డీఎంకు ఇప్పటికే వినతి పత్రం అందించాం. విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉన్న కారణంగా బస్సులను నడిపించడం లేదని తెలిపారు. ఈ మార్గంలో రోజు పత్తి లోడ్‌తోపాటు వరి ధాన్యం బస్తాలతో లారీలు వెళ్తున్నా.. ఆర్టీసీ బస్సు నడిపించడానికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఎమ్మెల్యే వివేక్ కూడా ఈ సమస్యను అసెంబ్లీ వేదికగా మాట్లాడినా.. నేటి వరకు పునరుద్ధరణ కాలేదు. సమస్య చిన్నదైనా పరిష్కరించే నాథుడు లేక పది గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

### చర్యలు తీసుకుంటాం : ఆర్టీసీ డీఎం

గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా కోటపల్లి మండలంలోని జనగామ రూట్‌లో బస్సు ట్రయల్ రన్ నిర్వహించి, బస్సు సేవల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటాం.

# కవ్వాల్‌లో బర్డ్‌వాక్

- అరుదైన పక్షుల గుర్తింపు
- వివిధ జిల్లాల నుంచి వచ్చిన పర్యాటకులు

జన్నారం, జనవరి 5 : కవ్వాల్ టైగర్ రిజర్వ్‌డ్ ఫారెస్ట్‌లో జన్నారం డివిజన్ తాళ్లపేట రేంజ్‌లోని మాకులపేట, ఇందన్‌పెల్లి రేంజ్‌లోని ఘనిశట్టి కుంట ప్రాంతాల్లో ఆదివారం 'బర్డ్‌వాక్ ఫెస్టివల్' నిర్వహించారు. జన్నారం, ఇందన్‌పెల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారులు సుష్మారావు, కారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన 15 మంది పర్యాటకులు, వారి కుటుంబ సభ్యులను సఫారీలో అడవిలోకి తీసుకెళ్లి వివిధ ప్రాంతాలను చూపించారు. ఈ సందర్భంగా కింగ్ ఫిషర్, కామన్ ఫిష్ ఈగల్, తండర్ కింగ్‌ఫిషర్, సర్పంట్‌ఈగల్‌తో పాటుగా మరో 16 రకాల పక్షులను పర్యాటకులు గుర్తించి కెమెరాల్లో చిత్రీకరించారు. పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా వసతులు కల్పించినట్లు జన్నారం రేంజ్ ఆఫీసర్ సుష్మారావు తెలిపారు.


చేపను తింటున్న కింగ్ ఫిషర్

రూఫాస్‌ట్రీపీ




కామన్ ఫిష్ ఈగల్

### 200 అరుదైన పక్షులను గుర్తించాను..



నాకు పక్షులంటే చాలా ఇష్టం. 15 సంవత్సరాలుగా కవ్వాల్ అడవుల్లో అరుదైన పక్షులపై అధ్యయనం చేస్తున్న. ఇప్పటి వరకు 200 అరుదైన పక్షులను గుర్తించిన. ఎక్కడ బర్డ్‌వాక్ జరిగినా వెళ్తాను. హైదరాబాద్‌లో దూలపెల్లి అకాడమీ నుంచి శిక్షణ కోసం వచ్చే ఎఫ్‌బీవోలు, సెక్షన్, ఎఫ్‌ఆర్వోలకు పక్షులు, వన్యప్రాణులపై అవగాహన కల్పిస్తున్న.

**-లింగంపెల్లి కృష్ణ, పక్షుల ప్రేమికుడు, ఆదిలాబాద్**

### కవ్వాల్‌కు మళ్లీ మళ్లీ రావాలనిపిస్తుంది



కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ అరుదైన పక్షులకు నిలయంగా ఉన్నాయి. ఎటు చూసినా దట్టమైన అడవి..వివిధ వృక్ష జాతులు, వన్యప్రాణులతో పాటు ఎన్నో రకాలు పక్షులున్నాయి. పక్షుల కిలకిల రాగాలు ఆనంద భరితంగా ఉన్నాయి. అధికారుల సహకారం బాగున్నది. కవ్వాల్ అడవికి మళ్లీ మళ్లీ రావాలనిపిస్తున్నది.

**- సైఫ్ మహ్మద్, పక్షుల పేమికుడు, కరీంనగర్**


చెన్నూర్ రేంజ్ ఫారెస్ట్‌లో పర్యాటకులతో అధికారులు, సిబ్బంది

### చెన్నూర్ రేంజ్‌లో ఆకట్టుకున్న బర్డ్‌వాక్

చెన్నూర్ రూరల్/భీమారం జనవరి 5: చెన్నూర్ రేంజ్‌లోని కిష్టంపేట, భీమారం, బూరుగుపల్లి అటవీ ప్రాంతాల్లో ఫారెస్ట్ అధికారుల ఆధ్వర్యంలో బర్డ్ వాక్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. శనివారం సాయంత్రం కిష్టంపేటలోని అంబేద్కర్ ఎకో టూరిజం పార్కులో పర్యాటకులు రిజిస్ట్రేషన్ చేసుకొని రాత్రి క్యాంప్ ఫైర్ నిర్వహించారు. ఆదివారం ఉదయం 5 గంటలకు సఫారీ వాహనాల్లో బూరుగుపల్లి సమీపంలో గొల్లవాగు ప్రాజెక్టుకు చేరుకొని బర్డ్ వాక్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ రకాల పక్షులను గుర్తించి తమ కెమెరాల్లో ఫొటోలు తీసుకున్నారు. అక్కడి నుంచి కిష్టంపేట అర్బన్ పార్కుకు చేరుకొని సీతాకోక చిలుకలను వీక్షించారు.


యెల్లో ఐడ్ బబ్లార్


కవ్వాల్ అడవుల్లో పక్షులను కెమెరాల్లో బంధిస్తున్న పక్షుల ప్రేమికులు